# రాజకీయం దెబ్బతింది

**కథానిక**

పసుపులేటి రామారావు

మూడు నెలల్లో పంచాయితీ ఎన్నికలనే వార్త ఆ వూరంతా రివ్వున వ్యాపించింది. కొందరినది చల్లని పిల్ల తెమ్మెరలా ఆహ్లాద పరచింది. మరి కొందరిని వడగాడ్పులా చెళ్లున దెబ్బ కొట్టింది. ఏమాత్రమూ చలనం కలుగ చేయలేదు, కొందరు ధన్యజీవులకు! ఆ వూరి చరిత్రలో ఇది చెప్పుకోవల్సిన విశేషమే మరి!

ఆ వూళ్ళో ఒక కులానికి బాగా డబ్బు ఉంది. ఆదికాలం నుండీ ఆ వూరిని ఏలుతున్నదీ వారే! భుజాలకు భుజకీర్తుల్లా – పదవులు, అందమైన పాదరక్షల్లా కాళ్ళ క్రింద అధికారాలు, చేతిలో డబ్బనే – తళతళ లాడే వజ్రాయుధం! వీటికి అదనపు అలంకారంలా మధుపానం. అదిలించే వాడు లేడు. అడ్డగించే వాడు అసలే లేడు.

ఇన్నేళ్ళ పాలనలో వారు చేసిందే విటయ్యా అంటే, వూర్నుండి పట్నం పోవటానికి అడ్డంగా వున్న పెద్ద కాలువకు వంతెనను రానీయక పోవటం, ఆ వంతెన వస్తే పట్నం నుండి దొంగలు, రౌడీలు వూళ్ళోకి చేరుతారట. వూరికి ఉత్తరాది నున్న స్మశానాన్ని పొలాల్లోకి కలిపేసుకోవటం. స్మశానంలోని మట్టిని త్రవ్వి అక్కడే ఇటుకలు చేసి ఇటుక బట్టీలు పెట్టేయడంతో, ఆ స్మశానం – నక్కలు, రాబందులు పీక్కుని తినేసిన ఎముకల పోగులా వుంటుంది. వర్షం వస్తే పుర్రెలు, పందులు తేలిపోతూ – చిన్న సైజు చెరువులా కనపడుతుంది. ఆ పెద్ద వారికి వేరే పెద్ద స్మశానం వుంది కనుక దీని సంగతవసరం లేదు.

ఈ వూరి నడి మధ్యన మంచి నీళ్ల చెరువుంది. మా చిన్నప్పుడయితే అందులో మంచి నీళ్ళుండేవి కాని, ప్రస్తుతం గేదెలు కడగటానికి, ఒడ్డున పందులు దొర్లటానికి వుపయోగిస్తోంది. ఆ పెద్ద లందరికీ ఇళ్ళల్లోకి బొంబాయిలు, నూతులూ వుంటాయి కనుక వారికి దాని సంగతవసరం లేదు. ఒరిగి ఒగ్గయిన ముసలమ్మలా బడి. దేశంలో ఎన్ని మార్పులొచ్చినా కాని, ముప్పయ్యేళ్ళుగా మారని మట్టి రోడ్డు.

ఈ మార్పులేని బ్రతుకుల్లోను, పాము పడగ నీడవంటి ఆ నిరంకుశుల పాలన క్రింద, చస్తూ బ్రతుకుతున్న ఆ జీవచ్ఛవాల కడుపుల్లో అగ్ని పర్వతాలు మండుతున్నాయి.

ఐదేళ్ళ క్రితం ఇలాగే ఎన్నికలన్నారు. కుంచం బియ్యం రూపాయిన్నరయినంత సంతోష పడిపోయారు జనం. అయితే రాజకీయం చివరకు కథను అడ్డం తిప్పేసింది.

ఆ పెద్ద కులంలో ఓ పెద్ద కుటుంబముంది. అదే మేం పుట్టక మునుపు పుట్టాక కూడా పెసిడెంటు పదవిని మోస్తున్నది. ఆ పదవి మీద మరెవ్వరికీ ఇన్నాళ్ళుగా మోజు పుట్టలేదా అనొచ్చు. ఏన్నో ఏళ్ళుగా పోలీసోళ్ళకి పెద్ద బాసుగాను, ఇన్‌కమ్ టాక్సు వాళ్ళకి

ప్రియమిత్రుడు గాను, రౌడీ మూకకు తిరుగులేని నాయకుడుగాను సిద్ధపడ్డ నారాయణగారంటే బాగా డబ్బున్న వాళ్ళకి కూడా భయమే; అంచేత ఆయన పదవి జోలికి పోరు.

ఈ ప్రెసిండెంటు నారాయణ గారికి రామ్మూర్తనే తమ్ముడున్నాడు. వీరికో ఎనభై ఏళ్ళ తల్లుంది. ఆ తల్లికి పది ఎకరాల మాగాణీ, లక్ష రూపాయిల దాకా వడ్డీలు తెచ్చిన సొమ్ము, నాలుబళ్ళ ఇత్తడి, వెండి మొదలయిన తాకట్టు సామానులున్నాయి. ఆ మధ్య ఆవిడ పోతూ పోతూ ఈ ఆస్థినంతా ప్రెసిండెంటు నారాయణ కిచ్చిపోయింది. దీన్తో రామ్మూర్తి గుండెల్లో మంటలు బయలు దేరాయి.

ఆ దెబ్బతో లేబరు పక్షాన కొచ్చే సాడు. వాళ్ళే నా ప్రాణం, నా బ్రతుకు అన్నాడు. పిచ్చి జనం పొంగిపోయారు. రామ్మూర్తికి సర్వం తామై నిలిచారు. ఆ అన్నదమ్ముల పోటీ తీవ్రతకు వూరంతా అట్టుడికి పోయినట్లు వుడికి పోయింది. ప్రజలంతా హడలెత్తారు. ఎక్కడ నోరు మెదిపితే ఏమవుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నారు.

నారాయణకు పై వర్గమంతా అండగా వుంది. నోట్లూ, మందు కుమ్మరించేస్తున్నారు.

ఎవరు గెలిచినా రెండోవాడు పూర్ని తగల పెట్టేస్తాడనే భయం పట్టుకుంది జనానికి. అలాంటి పరిస్థితిలో-

ఎల్లుండి ఎలక్షననగా బాంబులాంటి వార్త బయటకొచ్చింది.

అది - రాజీ!!

అన్న తమ్ములిద్దరూ రాజీ అయి పోయారు.

ఈ ఎలక్షను వల్ల స్నేహాలు, బంధుత్వాలు త్రెంచుకున్న వాళ్ళు, ఇంట్లోని డబ్బును మోహర్బానీకి కాల్చేసుకున్న వాళ్ళు వెర్రి వెధవలై, కళ్ళు తేలేసి, నోరు ఆవలించారు.

"ఈ లేబరు నాయాళ్ళంతా వూరికే డబ్బుని తినేస్తున్నారు, త్రాగేస్తున్నారు. అనవసరంగా వీళ్ళని మేపేస్తున్నాం. అక్కడ తిని వీళ్ళకి ఓటేస్తారు. ఇక్కడ తిని వాళ్ళకి ఓటేస్తారు. మనం మనం ఒకటే. మనకో కట్టుబాటు, క్రమం ఉండాలి. వాళ్ళకు లోకువై పోకూడదు" అని కూకలేసి, వచ్చే అసంబ్లీకి నారాయణ గారు ఎమ్మెల్యేగా నిలబడతారని, అప్పుడు ప్రెసిడెంటు పదవిని రామ్మూర్తికి మార్చేసేటట్లుగా నిర్ణయించి, రామ్మూర్తిని ఒప్పించి రాజీ చేయించారు.

'లేబరు నాయాళ్ళకు' అప్పుడు కళ్ళు తెరుచు కున్నాయి.

ఇదీ ఆనాటి ఎన్నికల గాథ!

మళ్ళీ ఇప్పుడు ఎన్నికలంటున్నారు. క్రింద తరగతి ప్రజలకు ఎలాగయినా ఎన్నికలు జరిపించాలని పట్టుదలవుంది. కానీ, ఆ అన్నదమ్ములకు ఎదురు నిలిచే వ్యక్తి లేడు వాళ్ళకు.

అలాంటి సమయంలో-వూరికంతటికి జమీందారయిన సూరయ్య నేనున్నానంటూ ముందు కొచ్చాడు. ఇతను అసలు రాజకీయాలంటే తెలీని మనిషి. సూరయ్యకు నారాయణగారి కుటుంబానికి ఆగర్భశత్రుత్వం. వీళ్ళకీ వాళ్ళకీ బంధుత్వం వుంది. అయితే ఎప్పుడో వచ్చిన ఆస్తి పంపకాల శత్రుత్వం అలాగే ఉండిపోయింది.

సూరయ్య రంగంలోకి రాగానే వూరంతా వేడెక్కింది. ప్రతీ వార్డుకు కత్తిలాంటి కుర్రాళ్ళను నిలబెట్టారు.

వార్డు వార్డుకీ విపరీతమైన ప్రచారం మొదలెట్టారు. పిడుగులాంటి సూరయ్యే గారి కుర్రాళ్ళముందు, నారాయణ మెంబర్లు ముసలీ, ముతకా అవటంతో పరిస్థితి సూరయ్యే వైపుకే అనుకూలంగా వున్న సమయంలో చరిత్ర గిర్రున తిరిగి వచ్చింది. మళ్ళీ – 'రాజీ'

కసాయి వాణ్ని నమ్మిన గొర్రెలకు తలతిరిగి పోయింది. సూరయ్యేను సమితి ప్రెసిడెంటు చేస్తానన్నాడు – ఎమ్మెల్యే నారాయణ. అంతే. బేరంలో అగర్భశతృత్వాలు, పగలు, పట్టు దలలూ నీరుకారిపోయాయి.

రాజీ అయి సూరయ్యే, నారాయణ విందులు గుడిచారు.

కానీ సూరయ్యే నిలబెట్టిన కుర్ర వార్డు మెంబర్లు తెల్లవారేసరికి వూళ్ళో ఒక్కడూ లేడు.

పూరూ, వాడా, చుట్టు ప్రక్కల ఇళ్లూ అన్నీ వెదికారు. ఏ ఒక్కడూ ఎక్కడా దొరకలేదు.

ఎలక్షను రోజున ఉదయం ఆరు గంటలకు పోలీసుల సహాయంతో వార్డు మెంబర్లు ఏడుగురూ దిగారు.

సాయంకాలాని కల్లా ఎలక్షను ప్రశాంతంగా జరిగి పోయింది, ఏడు వార్డుల్లోనూ.

రాజకీయానికి దిమ్మ తిరిగిపోయింది.

మీసాలు మెలితిరిగిన పెద్ద ఒక్కడూ బయటకు రాలేదు ఆరోజు. ఆనాటినుండే వూరి పెద్ద వీధి మధ్యలో వున్న శివాలయం అరుగు మీద కూర్చుని కబుర్లు చెప్పుకోవటం మొదలెట్టారు, అంతమందీ ధైర్యంగా.

# చేదు నిజాలు! . . . . . రాధేయ

వాడు
పాలేరు రంగడు
పెద్దిరెడ్డికి ఆజ్ఞాబద్ధుడు
రెండు జతల కాడెడ్ల పని
అవలీలగా ఒక్కడే చెయ్యగలడు
కామందుల వారికి కాళ్ళు పట్టడంలో
వాడికి వాడే సాటి
రంగడి పెళ్లాం రత్తి
రెడ్డి భార్యకు కుడి భుజం
సహనానికి మరో రూపం
ఆ తల్లి చింకి కోక దానం చేస్తే
చాలు కొండంత సంబరం తనకు
ఆ పెద్దింట్లో వారంతా
తినగా మిగిలిందే
మహా ప్రసాదంగా
కళ్ల కద్దుకుంటూ రిద్దరూ
యజమానికి ఏమాత్రం కష్టమొచ్చినా
కంట నీరు పెట్టక మానరు . .

కానీ . . ఆ జంటకు తీరని బాధ
భరించలేని వ్యథ ఒక్కటే
రత్తితో ఊసులాడే తీరిక
రంగడికి లేదు
రంగడిని తృప్తిగా చూసుకొనే
హక్కు రత్తికి లేదు
కాలు విరిగినా
కళ్లు పోయినా
తమను తాము పరామర్శించుకొనే
తాహతు లేదు.
కౌగిలించుకొని
కరువుదీరా ఏడ్చే వరం
వారి కెప్పుడో?